# చిరుదివ్వెలు

**గంట** సాయంత్రం అయిదయింది. వేసవికాలం కావడం వల్ల గాలిలో వేడి ఇంకా తగ్గ లేదు. బస్సు తప్పి పోతుందేమోనన్న ఆందోళనతో గబగబ నడచి బస్ స్టాండ్ చేరుకున్నాడు సుందరయ్య. త్వర త్వరగా నడవడం వల్లా, వృద్ధాప్యం వల్లా, ఆందోళన వల్లా శరీరమంతా విపరీతంగా చెమట పట్టడమే కాక, చాలా ఆయాసంగా కూడా అనిపించిం దాయనకు. తమ వూరు వెళ్ళే బస్సు ఏదైనా ఉందేమోనని అక్కడున్న అన్ని బస్సుల వేపూ చూసి, ఏదీ వెళ్ళదని నిర్ధారించుకున్నాక కాళ్ళీడ్చుకుంటూ షెడ్డులోకి వెళ్ళి అరుగు మీద చతికిలబడ్డాడు. చేతిలో చిన్న గుడ్డ సంచీ తప్ప మరే వస్తువులు లేవు. కాళ్ళకున్న చెప్పులు జీర్ణావస్థలో ఉన్నాయి. ఆయన రిటైర్ అయింది ఆరు నెలల క్రితమే అయినా, ముఖంలోని ముడుతలు పదేళ్ళ క్రితం రిటైర్ అయినట్లు భ్రాంతిని కలిగిస్తున్నాయి. పైనున్న ఉత్తరీయం తీసి ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుని, తేలిగ్గా వూపిరి తీసుకున్నాడు. దగ్గర దగ్గర రెండు కిలో మీటర్లు నడవడం వల్ల అలసటగా ఉండటమే గాక, దాహంతో నాలుక పిడచగట్టుకు పోతున్నది. బంకు వరకూ వెళ్ళి సోడా తాగి వస్తే బాగుండు నన్న ఆలోచన కలిగినా వోపిక లేక, అలాగే కూచుని, వెళ్తున్న బస్సుల వేపు చూడసాగాడు.

బస్తాల్లో వస్తువులను కుక్కినట్లే బస్సుల్లో జనాన్ని కుక్కేశారు! ఫుట్‌బోర్డు మీద నిలుచుని కమ్ములు పట్టుకుని వేళ్ళాడుతున్నారు చాలా మంది!

పడిపోతామన్న భయం లేదు కాబోలు!

'ఎన్ని బస్సులున్నా, ఎన్ని రైళ్ళున్నా ఈ రద్దీ ఏమిటో! వీళ్ళంతా అవసరం ఉండే ప్రయాణం చేస్తున్నారా?' అన్న అనుమానం కలిగింది సుందరయ్యకు.

'వెంటనే 'ఛా! ఛా! అలా ఎందుకనుకోవాలి? తనలాగే వాళ్ళు అవసరాలవాను!' అని మెల్లగా నవ్వుకున్నాడు.

'ఉదయం టౌనుకు వచ్చేటప్పుడు నిలుచునే వచ్చాడు తను, బస్సులో. ఉన్న వాళ్ళు చాలదన్నట్లు ప్రతి స్టాప్ దగ్గరా జనాన్ని కుక్కుతూనే ఉన్నారు. ధైర్యం చేసి పెద్దగా అడమని అనలేక తమలో తామే గొణుక్కుని, తృప్తిపడ్డారు ప్రయాణీకులు! వూపిరి తిరగక, ప్రాణం పోతుందేమో అన్న భయం కలిగింది తనకు!

ప్రాణ భయం కన్నా మరొక భయం జేబులో ఉన్న రెండు వేల రూపాయలు ఏమై పోతాయో నన్నది! ఆ డబ్బును జాగ్రత్తగా కాపాడి చలపతి చేతిలో పెట్టాక గానీ ప్రాణానికి విశ్రాంత ఏర్పడ లేదు!

ప్చ్! అలా డబ్బు తీసుకెళ్ళి చలపతి కివ్వడం పసేమిరా తనకు ఇష్టం లేదు.

కానీ, ఇవ్వక తప్పలేదు.

ఆ ఆలోచనతో సుందరయ్య హృదయం బరువెక్కింది. మెల్లగా నిట్టూర్చి చుట్టూ కలయ చూశాడు.

'జరిగిం దేదో జరిగిపోయింది. ఇక దాన్నిగురించి ఆలోచించకూడదు' అనుకున్నాడు.

అయినా, ఆలోచనలు ఆయనను వదిలి పెట్టలేదు.

చేసింది స్కూలు మాస్టరు పనే అయినా నీతిగా, నిజాయితీగానే బతికాడు. తను విద్యార్థులకు చదువు చెప్పడమే కాక, భావి భారత పౌరులకు కావలసిన ఆదర్శప్రాయమైన నడవడికను నేర్పడంలో అహర్నిశం కృషి చేశాడు.

ఏ విద్యార్థి అన్నా తప్పు చేసినట్టు తెలిస్తే తీవ్రంగా మందలించడమో, శిక్షించడమో చేసేవాడు. అంతేకానీ, తనకేం పట్టనట్టు చూస్తూ వూరుకునే వాడు కాదు. ఇన్ని సంవత్సరాల సర్వీసులోనూ ఒకరి చేత ఒక మాట అనిపించుకోనూలేదు, దారి తప్పనూ లేదు.

కానీ, ఈరోజు?

ఎవరూ వేలెత్తి చూపకపోయినా, అంతరాత్మే పదే పదే ప్రశ్నిస్తున్నది.

ధనవంతుల కిన్ని సమస్య లుంటాయో లేదో కానీ, తనకు మటుకు తల్లో వెంట్రుకలన్ని! రోజులు జరుగుతున్న కొద్దీ ప్రతిదీ సమస్యే అయిపోతున్నది.

ఆ రోజుల్లో ఇలా అయితే ఎలా చదువుకోగలిగేవాడు? ఎస్. ఎస్. ఎల్. సి. పాసై సెకండరీ గ్రేడ్ ట్రెయినింగ్ అయ్యాడు. ఆమాత్రం చదివించను నాన్నకు పెద్దగా కష్టం అనిపించలేదు. తనకూ పెద్ద పెద్ద కోర్కె లేమీ లేవు. ఏదో ఒక పల్లెటూళ్ళోని స్కూల్లో పాఠాలు చెప్పుకుంటూ ప్రశాంతంగా బతకాలనుకున్నాడు.

అలాగే జరిగింది కూడా ఇంతవరకూ.

---

'వాచస్పతి'

---

అయితే, ఒకటే తను చేసిన పొరపాటల్లా... నలుగురు పిల్లలకు తండ్రి కావడం...!

పెద్దవాడు శంకర్ ఇంటర్ తప్పగానే తనకు బరువు కాకూడదని కాబోలు స్నేహితుని సాయంతో మిలిటరీలో చేరిపోయాడు. సిపాయిగా వెళ్ళి ఎలాగో నింద్రొక్కుకుని తన బతుకు తను బతుకుతున్నాడు. పాపం, వాడికి తను చేస్తున్న సాయం ఏమీ లేదు. తనకే అప్పుడప్పుడూ పాతికా పరకా పంపుతూ సాయపడుతున్నాడు.

రెండోవాడు సూర్యం బి. ఎ. వరకూ చదువుకున్నాడంటే అది శంకర్ ఇచ్చిన ప్రోత్సాహమూ సహాయాల ఫలితమే.

సూర్యం తరవాత ఇద్దరూ ఆడపిల్లలే.

సూర్యానికి ఉద్యోగమైతే శంకర్ పెళ్ళీ, పెద్దమ్మాయి పెళ్ళీ ఒకేసారి చేయాలని అనుకుంటున్నాడు. అలాగైతే ఖర్చులు కాస్త కలిసి వస్తాయని తన ఆశ!

ప్చ్! సూర్యం బి. ఎ. ప్యాసై మూడు సంవత్సరాలైనా ఇంతవరకూ ఉద్యోగం మటుకు రాలేదు. చేసిన, చేస్తున్న ప్రయత్నాలకు లెక్కలేదు.

పెద్దవాడు సంవత్సరానికొకసారి వస్తాడు. వాని తల మీద త్వరగా నాలుగు అక్షింతలు వేయిద్దామంటే, స్వార్థం అడ్డు పడుతుంది. తను ఆరు నెలల క్రితం రిటైర్ అయ్యాడు. శంకర్‌కు పెళ్ళిచేస్తే డబ్బు పంపడేమో అని భయం! తలిదండ్రుల్లోనూ అంతో ఇంతో స్వార్థం ఉంటుందనడానికి తామే నిదర్శనం!

చెవులు గింగుర్లు పోయేలా బస్సు హారన్ విని పించటంతో సుందరయ్య ఆలోచనలకు అంతరాయం కలిగింది. చివాల్న లేచి, ఆగిన బస్సువేపుగా గబగబ నడిచాడు. తీరా వెళ్ళి చూస్తే, తనువెళ్ళవలసిన బస్సు కాదది.

కొద్దిగా నిరాశ.

తిరిగి వచ్చి తన స్థానంలో కూచున్నాడు.

ఇంతకూ చలపతి పని చేస్తాడో లేదో?

ఆ ఆలోచన రాగానే మనసులో ఆందోళన చెలరేగింది.

మళ్ళీ ఆలోచనలు —

చలపతి మోసం చేయడు కదా? ఏమో?

తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పని చేయలేదు. ఇంట్లో వాళ్ళు ఒత్తిడి చేస్తేమటుకు తనెందు కిలా చేశాడు?

ఎందుకంటే, వేరే దారి లేకనేకదా!

నాలుగు రోజుల క్రితం సూర్యం ఇంటర్వ్యూకి వెళ్ళివచ్చాడు.

"ఈ సారన్నా ఏమన్నా ఆశ ఉందంట్రా?" ఆశగా అడిగింది అనసూయ.
తను కళ్ళతో అదే ప్రశ్న వేశాడు.
"ఉహూఁ..." అంటూ తల అడ్డంగా ఊపాడు సూర్యం.
ముఖం వేళ్ళాడేసుకుని దీనత్వానికి, నిరాశకు ప్రతి రూపంలా ఉన్నవాణ్ణి చూడగానే కడుపులో దేవినట్లయింది తనకు. ఏమీ చేయలేని నిస్సహాయుడు తను.

ఒక మామూలు రిటైరైన బడిపంతులు!
"ఏం! ఇంటర్వ్యూలో సరిగ్గా చేయలేదా?"
"ఈ ఇంటర్వ్యూల వల్ల లాభం లేదు, నాన్నా!" అన్నాడు తలెత్తి తన ముఖంలోకి చూస్తూ.
వాని కళ్ళలోని భావాలను చదివిన తను లోలోపలే వణికిపోయాడు!
కోపం, కసి, అన్నింటినీ మించి ఏదో విద్రోహ భావం! తనకింత అన్యాయం చేస్తున్న ఈ సమాజాన్ని సమూలంగా పెకలించి వేయాలన్న ఆవేశమూ, అలా చేయలేనందుకు ఆవేదనా, ఇంకా ఏవేవో భావాలు వాని కన్నుల్లో...
"అంటే?" తన మనసులోని భయాన్ని ఏ మాత్రం పైకి కనిపించనీక ప్రశ్నించాడు.
"మధ్యాహ్నం హోటల్లో భోంచేస్తుంటే చలపతి మామ కనిపించాడు..." అన్నాడు కాస్త ఉత్సాహంగా. చెప్తున్న విషయానికీ, చలపతికీ మధ్యనున్న సంబంధం ఏమిటో అర్థం కాలేదు మొదట.
"మాట్లాడాడా?" ఆత్రంగా అడిగింది అనసూయ. చలపతి అనసూయకు దగ్గర బంధువు ఈ మధ్య ఏవేవో వ్యాపారాలు చేసి రెండు చేతులా ఆర్జించి, ఆకాశంలోని తారల పక్కన మరో తారగా వెలిగి పోతున్నాడని అందరూ అనుకోవడం.
అందుకే అనసూయ అలాంటి ప్రశ్న వేసింది.
"ముందు నేనే పలకరించానమ్మా! 'నువ్వట్రా' అంటూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడాడు. నా ఉద్యోగం విషయం అడిగాడు. ఈ మూడు సంవత్సరాలుగా చేసిన ప్రయత్నాలూ, వెళ్ళిన ఇంటర్వ్యూలూ అన్నీ చెప్పాను. ఈ రోజు వెళ్ళిన ఇంటర్వ్యూ సంగతీ చెప్పాను!" అని అదో రకంగా నవ్వాడు తనవేపు చూసి.
లోకం విషయం మీకన్నా నేనే బాగా అర్థం చేసుకున్నానన్న భావం ఉందా నవ్వులో.
"ఊఁ?..."
"చలపతి మామ ఏమన్నాడంటే, నాన్నా! ఇంటర్వ్యూలంటూ ఆఫీసుల చుట్టూ ఎన్నాళ్ళు తిరుగుతావురా సూర్యం? మీ నాన్నను రెండు వేలు తెచ్చివ్వమని చెప్పు. ఇక్కడో ఆఫీసులో ఎల్. డి. సి. పోస్టుంది. ఆ ఆఫీసరు నాకు బాగా తెలుసు. ఆ పోస్టు ఇప్పిస్తాను అన్నాడు" అని తన ముఖంలోని భావాలను పరీక్షగా చూడసాగాడు.
ఆ మాటలు నిజంగా తనకో షాకు!
లంచం ఇవ్వడమా?
అలాంటి పని ఎప్పుడూ చేయలేదు.
అందుకు ముఖ్య కారణం అలాంటి అవినీతి పనులు తనకు ఇష్టం లేకపోవడమే.
"రెండు వేలా?" అన్నాడు ఆశ్చర్యం నుండి తేరుకుని. రెండు వేలంటే తన దృష్టిలో పెద్ద మొత్తమే! ఎంత కష్టపడితే, ఎంత పొదుపు చేస్తే రెండు వేలు కూడుతాయి?
ఆ మాటే అన్నాడు సూర్యంతో.
"మీరు చెప్పింది నిజమే నాన్నా. కానీ, నా మాటా కాస్త వినండి! మధ్యాహ్నం నుండీ ఈ విషయం బాగా ఆలోచించే మీ దగ్గర ప్రస్తావిస్తున్నాను. ఈ మూడేళ్ళలో ఇంటర్వ్యూల కంటూ ఎంత తక్కువగా లెక్క వేసినా, వెయ్యన్నా ఖర్చు పెట్టానా లేదా? హైదరాబాద్ రెండు సార్లు వెళ్ళాను. ఆ ఖర్చే అయిదు వందలయింది. అలాంటి ఇంటర్వ్యూలు ఎన్నో! పోనీ, ఇక ఉద్యోగం వస్తుందా అంటే అదీ చెప్పలేం. ఇంకో మూడు సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ఆఫీసుల చుట్టూ తిరిగినా మరో వెయ్యి ఖర్చు కాదా? అప్పటికీ ఉద్యోగం వస్తుందన్న గ్యారంటీ ఏం లేదు. కనుక చలపతి మామ చెప్పినట్లు చేస్తే ఏం?"
చేస్తే ఏం అంటే ఏం చెప్పగలడు? తనకి అడ్డ దారులన్నీ తెలీవు. తెలిసినా అలా వెళ్ళడం ఇష్టం లేదు.

## మాటల గారడీ

మనుషుల స్వభావాన్ని మార్చే మంత్ర దండ మేదైనా ఉంటే ఉంటుందా అనే విషయం వివరించటానికై ఆర్థర్ వేదాంతి చెప్పిన కథ: ఒకడు తన దగ్గరున్న ఒక ముతక తివాచీని బజార్లో అమ్మజూపాడు. అటు వెళుతున్న ఒక వ్యక్తి దానిని పరిశీలించి "ఇది బహు ముతకగా ఉన్నది. అదీకాక బాగా పిగిలి పోయింది" అని బేరం చేసి కారు చౌకగా కొనేశాడు.
కొన్నవాడు మరి కాసేపట్లో లేచి నుంచుని అటు వెళుతున్న మరొకడితో "ఇదుగో—నా వద్ద పట్టు శాలువా కన్న మెత్తని పైన తివాచీ ఉన్నది. భలే మంచి బేరం. సీకలాంటిది మరెక్కడా దొరకదు" అని ప్రకటించాడు.
ఆ దోవన నడిచి వెళుతున్న ఒక వేదాంతి, అంతకు క్రితమే జరిగిన కొనుగోలు, అదే వస్తువును మరో విధంగా వర్ణిస్తూ అమ్మజూపు తున్న తీరూ గమనించి ఆశ్చర్యపోయి, ఆ తివాచీ కొని మరీ బేరానికి అమ్మజూపుతున్న వాని వద్దకు వెళ్ళి "ముతక తివాచీని మెత్తటి తివాచీగా రూపొందించ గలిగిన మహాయాదు మంత్ర మేదో నీ దగ్గర ఉండి ఉండాలి సుమా. ఇనుమును బంగారంగా మెరిపింప జేసే నీ ఇంద్రజాలంతో నన్నుకూడా దైవసమానుడిగా మార్చెయ్య రాదూ?" అని వేడుకున్నాడు.

— ప్రసీల్



ఈ రోజు తన కొడుకు ఆ దారి చూపిస్తున్నాడు. 'ఇది మంచి దారి కాదురా' అంటే వాదిస్తాం అంటాడు కాబోలు!
'పనికిమాలిన నీ నీతి వెధవాయి' అంటే 'నా జీవితం నాశనం చేస్తారా?' అనిపించినా అనవచ్చు.
తను మౌనంగా ఉండడం చూసి, తిరిగి సూర్యమే అన్నాడు:
"మనం ఈ మాటు మాట పెట్టిలో వినుమన్నాం. జరుగుతున్న విషయాలు చాలా వరకు మనకు తెలీదు."
'మీకు తెలీదు' అనలేక 'మనకు తెలీదు' అన్నాడని తను ఉద్దేశం.
కన్నకొడుకు సిసి ముడుచుకుంటూ మౌనంగా ఉండిపోయాడు. "డబ్బు లేనిదే ఏ పనీ కావడం లేదు, నాన్నా! అలా లేదంటే రికమెండేషన్ అన్నా ఉండాలి. డబ్బైనా అప్పు తెచ్చుకోగలం కానీ రికమెండేషన్ ఎలా వస్తుంది మనకు?" అన్నాడు కోపంగా, నిస్పృహగా.
"ఇంకో సంవత్సరం చూద్దాం. అప్పటికీ దొరక్కపోతే..." నచ్చచెబుతున్న ధోరణిలో మెల్లగా అన్నాడు. విసురుగా తలెత్తి కోపంగా చూశాడు.
"ఇక ఒక్క సంవత్సరం కాదు, పది సంవత్సరాలు చూసినా ఇంతే! నా లాంటి మామూలు బి. ఎ. గాడికి ప్రస్తుత పరిస్థితుల్లో మోక్షం లేదు!! మీరు కాదంటే నే నిలా నిరుద్యోగిగా తిరగవలసిందే.
ఈ అవకాశం వదులుకుంటే మరో అవకాశం రమ్మన్నా రాదు" అని కొద్ది క్షణాలు ఆగి, "నాలుగు రోజుల్లో ఏ విషయమూ ఆలోచించుకుని డబ్బు తెచ్చివ్వమన్నాడు చలపతి మామ" అని విసవిస లాడుతూ అక్కడనుండి వెళ్ళిపోయాడు.
వ్యథా భరిత దృక్కులతో అనసూయ ముఖం లోకి చూశాడు.
"రోజు లలా ఉన్నాయండీ! మీరు మడి గట్టుకుని కూచుంటే లాభం లేదు" అంది అనసూయ.
"ఏమో? ఇలాంటి పనులు నాకు ఇష్టం లేదని తెలిసీ ఎందుకిలా మాట్లాడుతున్నావు? నలుగురికి దారి చూపిన నేను, దారి తప్పడం ఏమన్నా బాగుంటుందా? ఈ రోజు కాకుంటే రేపు రాదా ఉద్యోగం? అవినీతి, లంచగొండితనం ఎందుకిలా రోజు రోజుకూ ప్రబల మవుతున్నాయి? మన లాంటి వాళ్ళం ప్రోత్సహించడమే అందుకు కారణం. కాదంటావా?"
అనసూయ ముఖం కోపంతో జేవురించింది.
"అవును, మీ రిచ్చిన లంచాలు తీసుకునే అంతా లక్షాధికారులై పోయారు! పాతవాళ్ళు మాట్లాడితే 'మా రోజులు మా రోజులు!' అంటారు. ఆ రోజులూ, ఈ రోజులూ ఒకటి కాదని అందరూ చెబుతున్న విషయమే! మొన్నీమధ్య మన శరణంగారి మనమణ్ణి హైదరాబాదులో ఆదేదో స్కూల్లో చేర్పించేందుకు అయిదు వందలిచ్చారట" అని కొడుకుకు పూర్తి మద్దతు ఇచ్చింది.
ఇక ఏం అనలేక "సరే, ఆలోచిద్దాంలే" అన్నాడు.
"బాగుంది మీ వరస! ఇలా మీన మేషాలు లెక్కిస్తూ కూచుంటే, ఆ అవకాశం కాస్తా చెయ్యి జారిపోతుందని వాడు మొత్తుకుంటున్నాడు. [illegible]

ఉద్యోగం రాగానే శంకర్ పెళ్ళి, వాణి పెళ్ళి చేయాలను కుంటున్నాం కదా? ఆ పెళ్ళిళ్ళు అయితే కానీ తేలిగ్గా వూపిరి తీసుకోలేం. నలుగురికీ జవాబులు చెప్పలేక నా తల ప్రాణం తోక కొస్తూంది. ఇక ఆలోచించ వలసిందేమీ లేదు. నా మాట వినండి! వాడికి విసుగొచ్చి ఇల్లు వదిలి వెళ్ళిపోయినా పోవచ్చు. నీతిగా ఉండి మనం లోకాన్ని ఉద్ధరించేదేమీ లేదు.''

నిజమేనేమో... ఊహుఁ... ఏమో?

''డబ్బు?'' నసిగాడు.

''మన దగ్గర డబ్బు లేదని నాకు తెలీదా?'' విచారమూ, హేళనా మిళితమై ఉన్నాయి అనసూయ కంఠంలో.

''ఎలా మరి?'' విస్మయంగా అన్నాడు.

''ఒకటి రెండు నెలల్లో మీ పి. ఎఫ్. డబ్బు వస్తుందని అన్నారు కదా? రేపు వెళ్ళి ప్రయత్నిస్తే...''

''ఎంత పిచ్చిదానవే! రేపు వెళ్ళి అడగగానే మన డబ్బు మన చేతిలో పెడతారా? అంత చురుగ్గా పనులు సాగితే ఇక అనుకో వలసిం దేమిటి? మన బాధల్లో కొన్నయినా తగ్గేవి. ఆ పి. ఎఫ్. డబ్బు ఇంకో సంవత్సరానికి వస్తే సంతోషించవలసిన విషయమే!''

''ఇంట్లో కూచుంటే పనులౌతాయా? రేపు వెళ్ళి ప్రయత్నించండి.''

వెళతాననీ అనలేదు, వెళ్ళననీ అనలేదు.

అనసూయా, సూర్యం ఆ రోజంతా ఒకరితో మాట్లాడ లేదు. తన మవునమే వాళ్ళ కోప కారణం. ఇక తప్పదని మరునాడు డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్సుకు బయలుదేరి వెళ్ళాడు.

తనతోపాటు కొన్నాళ్ళు పని చేసి, రిటైర్ అయిన రాజగోపాలం టౌన్‌లోనే ఉంటున్నాడు. కొడుకు లిద్దరూ ఉద్యోగాల్లో ఉన్నారు. ఏ చీకూ చింతా లేకుండా హాయిగా కాలం వెళ్ళబుచ్చుతున్నాడు వాడు.

బస్సు దిగి నేరుగా రాజగోపాలం ఇంటికే వెళ్ళాడు. సాదరంగా ఆహ్వానించాడు.

కుశల ప్రశ్నలూ, అతిథి మర్యాదలూ అవీ అయ్యాక తను వచ్చిన పనేమిటో చెప్పాడు.

''ఆ ఆఫీసులో తెలిసిన వాళ్ళెవరూ లేరు సుందరం! ఏం చేస్తాం?'' అన్నాడు నొచ్చుకుంటూ.

''పోనీ, ఒకసారి వెళ్ళి కనపడితే?''

''దానిదేముంది? వెళదాం, పద.''

ఇద్దరూ బయలు దేరారు.

ఆ కన్సర్న్డ్ క్లర్కు సరిగ్గా జవాబు చెప్పలేదు. తన కష్టాలూ, ఇబ్బందులూ అన్నీ ఏకరువు పెట్టు కున్నాడు. అతను ముఖం అదోలా పెట్టుకుని కూర్చు న్నాడు. 'ఏమిటీ సొద?' అన్నట్లు.

తనకు చాలా కష్టం కలిగింది.

అయినా, చేయగలిగిందేమీ లేదు.

అదో రకమైన నిస్సహాయత.

''ఒక మాట!'' అంటూ రాజగోపాలం ఆఫీసు బయట ఉన్న చెట్టు కిందకు తీసుకు వెళ్ళాడు.

''ఏమిటో చెప్పు'' అన్నట్లు చూశాడు.

''వాళ్ళ మామూళ్ళు వాళ్ళ కందాలి. లేకుంటే నీ విలా తిరుగుతుండవలసిందే!''

అది విన్నాక తన హృదయం బాధతో మెలికలు తిరిగిపోయింది.

ఎక్కడా ఇదే తంతా?

విన్న సూర్యం డబ్బిస్తే కానీ ఉద్యోగం దొరకదని ఖచ్చితంగా చెప్పాడు.

ఈ రోజు గోపాలం డబ్బిస్తే కానీ పని కాదని చెబుతున్నాడు.

అలా అయితే తన లాంటి దరిద్రులు ఎలా బతగ్గలరు?

''నేనో పేద ఉపాధ్యాయుణ్ణి—పైగా రిటైర్ అయినవాణ్ణి! నే నేం ఇవ్వగలను?''

రాజగోపాలం అదో రకంగా నవ్వుతూ—''అంతా ఇవ్వగలిగే ఇస్తున్నారా? వరకట్నాల విషయం తీసుకో. శక్తి లేకున్నా వేలకు వేలు పోసి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేస్తున్నారా లేదా! అలాగే ఇదీను!''

తను చిన్నగా నవ్వాడు.

''నవ్వితే సరిపోదు, సుందరం!''

''ఎందుకివ్వాలి?'' కాస్త కోపంగానే అన్నాడు.


''నీ పని చేసి పెట్టేనందుకు!''

''అందుకు వాళ్ళు జీతం తీసుకుంటున్నారు.''

భయపడడం మరో కారణం కావచ్చు. ఎలాగో ఒకలా పని జరగాలి. అది ఎలాగైనా పరవాలేదు. అన్న ధోరణి కొచ్చాం మనం! ఎవరి ఆత్రం వారిది. ఎవరి పరుగు వారిది. పరిస్థితు లలా ఉన్నాయి. ఆ ప్రభావానికి దాసోహ మనక తప్పడం లేదు. అందుకని ఎవరినీ ఏమనలేం.''

''వూఁ! ఈ పరిస్థితులు ఇక మారవంటావు?'' మెల్లగా నిట్టూర్చి అన్నాడు.

''అవినీతి, లంచగొండితనం వేళ్ళతో సహా పాతుకు పోయాయి. ఇది తప్పనీ, దీన్ని రూపు మాపాలనీ నీ లాంటి వాళ్ళు ఒకరిద్దరు తప్ప ఎక్కువ మంది అనుకోవడం లేదు. ఎంత అవినీతికి పాల్పడినా దండన లేదు. 'అంతులే' కేస్ చదివావు కదూ! అలాంటి వారు ఎందరో యథారాజా, తథాప్రజా! కుళ్ళి పోయిన ఈ సమాజాన్ని ఇక బాగు పరచలేం. రష్యాలో లాగో, ఫ్రాన్సులోలాగో విప్లవం రావాలి. కొత్త సమాజం ఏర్పడాలి. అంతేగానీ, దీన్ని మరమ్మత్తు చేయడం వీలుకాని పని.''




''డబ్బిస్తే త్వరగా అవుతాయి పనులు.''

''ఇస్తేనంటే అప్పుడే కానీ...''

''ప్చ్! నీ ఖర్మ! అనుభవించు.''

''నా ఒక్కడి ఖర్మ కాదు, ఈ దేశంలో నాలాంటి వాళ్ళ ఖర్మ ఇలా ఉంది. తప్పనితెలిసీ దీన్ని ప్రోత్సహిస్తున్నాం! అదే నాకు బాధగా ఉంది.''

''ప్రోత్సహించడం కాదు. పొరబడుతున్నావు... ప్రోత్సహించే దశను ఏ నాడో దాటిపోయింది. ఇప్పుడిది వేళ్ళతో సహా పాతుకు పోయింది. ఇవ్వడం, తీసుకోవడం అతి మామూలు విషయం అయి పోయింది. తీసుకునే వాడు పోనీ, కనీసం ఇస్తున్న వాడన్నా, ఇస్తున్నందుకు బాధ పడటం లేదు. ఎందు కివ్వాలని ప్రశ్నించడం లేదు. నీ లాంటి ఒక రిద్దరు తప్ప.''

''ఎందు కిలా జరుగుతుం దంటావు?'' వ్యధిత కంఠంతో ప్రశ్నించాడు.

''రోజు రోజుకూ కాంపిటీషన్ ఎక్కువై పోతు న్నది. ప్రతి ఒక్కరూ వెనకబడి పోతామేమోనని

''ఆ విప్లవం కూడా అంత త్వరగా రాదు. అన్యాయమంటే కమ్యూనిస్టులంటారు. ఎదురు తిరిగితే నక్సలైటని కాల్చేస్తారు! ఏం జరుగుతున్నా అలా కళ్ళప్పగించి చూస్తూండవలసిందే. ఇక పోతా, నేను'' అని సంచీ తీసుకున్నాడు.

''రెండు వందలు పడేస్తే పోదూ! డబ్బు త్వరగా చేతి కొస్తుంది. ఇబ్బందుల్లో ఉన్నావేమో!'' అన్నాడు మరో ప్రయత్నంగా.

''ఆ రెండు వందలుంటే అమ్మాయి లిద్దరికీ రెండు మూడు చీరలు కొనవచ్చు'' అని విచారంగా నవ్వి ''అసలు డబ్బు నా కెందుకింత అర్జెంటుగ కావాలో చెప్పలేదు కదూ!'' అని సూర్యం ఉద్యోగం విషయం చెప్పాడు.

''అలాగా! ఎలాగో ఆ రెండువేలూ సర్దు. ఇక్క డంటే ఇవ్వనన్నావు. అక్కడా అలా చేస్తే మరో అవకాశం రాకపోవచ్చు. ఈ కాలం పిల్లల ప్రవర్తన చూస్తూనే ఉన్నాం. విరక్తి చెంది ఏ అఘాయి త్యానికో పాల్పడవచ్చు.''

"అలాగని ..." నసిగాడు.

"ఏది మొండి పట్టుదలరా, సుందరం! ప్రవాహంతో పాటు మనమూ పోవాలి. ఎదురు తిరిగితే ఏమవుతుంది? మధ్యలోనే అలసిపోతాం. ఎప్పటికీ ఒడ్డు చేరుకోలేం. లేదా, మధ్యలో మునిగిపోవచ్చు కూడా." మందలింపుగా అన్నాడు.

"పోనీలే! నా లాంటి వాళ్ళు కొందరు మునిగిపోతే సన్నా కొందరికన్నా జ్ఞానోదయం అవుతుందేమో?" అన్నాడు విచారంగా.

"అది కలలోని మాట! అలా ఎప్పటికీ జరగదు" అన్నాడు స్థిరకంఠంతో.

"వస్తానోయ్! నీ ఆతిథ్యానికి అనేక వందనాలు."

"బాగా ఆలోచించుకో. తర్వాత పశ్చాత్తాపపడి లాభం లేదు."

'అలాగే' అన్నట్టు తలూపి బస్ స్టాండ్ వేపు నడిచాడు. అనసూయ పోరు పడలేక వచ్చాడు కానీ, వెంటనే ఇక్కడ డబ్బు ఇస్తారనీ, అది తీసుకెళ్ళి చలపతికి ఇవ్వాలన్న ఉద్దేశంగానీ తనకు లేదు.

ఇంటికి వెళ్ళగానే అనసూయ కళ్ళు తుడుచుకుంటూ "ఉదయమనగా వెళ్ళిన వాడు ఇంతవరకు ఇంటికి రాలేదు. మధ్యాహ్నం భోజనం చేశాడో లేదో, ఎక్కడ తిరుగుతున్నాడో ఏమో?" అంది డగ్గుత్తికతో.

గుండె గుభిల్లుమంది.

"బెదిరిస్తున్నాడా?" తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో కోపంగా అన్నాడు.

"మిమ్మల్ని బెదిరిస్తే మటుకు బెదిరిపోతారా? పోనీండి! వాని రాత ఎలా ఉంటే అలా అవుతుంది" అని పైట చెరగులో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా రోదించసాగింది.

మనసు బాగా కలత చెందింది. ఎవరిని ఏమనగలడు? భోజనం చేయాలని అనిపించలేదు.

సూర్యం ఇంటికి రాలేదు రాత్రయినా. ఆ రాత్రి అంతా అభోజనంగానే ఉన్నారు. ఏవేవో ఆలోచనలతో, అర్థంలేని భయాలతో నిద్రకూడా సరిగ్గా పట్టలేదు.

తెల్లవారాక కూడా సూర్యం రాలేదు. ఏం చేసేందుకూ తోచలేదు. ఒకరితో ఒకరు మాట్లాడుకోను కూడాభయపడి, మౌనంగా ఒకరినొకరు తప్పించుకుని తిరిగారు.

సాయంత్రానికి వాడిపోయిన ముఖంతో ఇల్లు చేరుకున్న సూర్యాన్ని చూడగానే తన గుండెమీద నుండి ఏదో పెద్ద బరువు తొలగిపోయినట్లనిపించింది. వాడెక్కడికన్నా వెళ్ళిపోతే, తను అనసూయకు ఏమని సమాధానం చెప్పగలడు?

"నిన్నట్నుండి ఎక్కడ తిరుగుతున్నావు?" కృత్రిమ కోపంతో ప్రశ్నించాడు, సూర్యాన్ని.

"నా ప్రయత్నాలేవో నేను చేసుకుంటున్నాను." ముఖం నిండుకూ గంటు పెట్టుకుని అన్నాడు.

కొరడాతో చెళ్ళుమని కొట్టినట్టయింది. అంటే వాడికోసం తనేం చేయలేదనేగా సూర్యం మాటల అర్థం?

వాడు చెప్పినట్టు చేయలేదనే కదూ ఆ కోపం, ఆ తిరస్కారం!

ఎప్పుడూ కోపంలో, బాధలో మనిషి నిజానిజాలను గుర్తించడు. కానీ, లంచం ఇవ్వనిదే ఉద్యోగం రాదన్న వాని తర్కంలో అంత బలం లేదేమో అనిపిస్తుంది. అందరూ అలా చేస్తున్నారు గనుక మనమూ అలా చెయ్యాలనడం ఎంత అర్థహీనంగా ఉంది? లోకంలో మంచితనం, నీతి అసలు లేనేలేవా? ఆ రాత్రంతా అనసూయ ఏడుస్తూనే ఉంది.

"ఇప్పు డేమైందని! ఎందుకా ఏడుపు?" విసుగ్గా అన్నాడు.

"ఆ డబ్బు రాలేదని ఊరుకుంటే ఎలాగ? వాడు మాట్లాడే తీరు చూస్తుంటే నాకు భయంగా ఉంది. ఎటన్నా వెళ్ళిపోతే...లేదా..."

"పోతే పోనీ..."

"అవును! మీకేం? నవమాసాలు మోసి, కని పెంచిన తల్లి మనసు ఎంత కుంగి పోతుందో మీ కెలా అర్థమవుతుంది?"

"అలాగా... గంగలో దూకమన్నావా?" కోపంతో అరిచాడు.

"పిల్లల కోసం ఏదన్నా చేయాలి. సాయంత్రం వెళ్ళి రత్నమ్మను డబ్బడిగాను — ఇస్తానంది."

"ఎందు కివ్వదు? శంకర్ పంపే ఆ కాస్త


ఆనందంగా వ్రాయుటకు!

బ్రిల్

సిరాతో IS.1221 ISI

అద్భుతమైన 8 రంగులలో

Bril INKS




బ్రిల్ గమ్, బ్రిల్ పేస్ట్,
బ్రిల్ స్టాంప్ ప్యాడ్స్

ఇండస్ట్రియల్ రిసర్చి
కార్పొరేషన్
బెంగుళూరు-560 055 మరియు
మద్రాసు-600 041.

ADWAVE/IRC/1857 TEL

10—2—82

డబ్బొ అమె పద్దికి పరిపోతుంది! మనం పస్తు లుంటే సరి!"

"సూర్యానికి ఉద్యోగం వస్తుంది కదా?"

"ఇక మాట్లాడకు." కసురుకున్నాడు.

గొణుక్కుంటూ అక్కడ నుండి వెళ్ళిపోయింది.

ఆ రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఎంత ఆలోచించినా వేరే దారంటూ ఏదీ కని పించలేదు. మర్నాడు రత్నమ్మ దగ్గర డబ్బు తీసుకుని బస్సు ఎక్కాడు. చలపతి ఇల్లు కనుక్కునేందుకు అంత శ్రమ పడవలసిన అవసరం లేకపోయింది.

సంవత్సరం క్రిందటే కొత్త ఇల్లు కట్టి మహా వైభవంగా గృహప్రవేశోత్సవం జరిపాడు. ఆహ్వాన పత్రిక తమకూ వచ్చింది.

"వెళ్దామా?" అన్నాడు అనసూయతో.

"మనకెందుకు లెండి అవన్నీ!" అని కొట్టి పడేసింది.

"నీ కిష్టం లేకుంటే పోనీ..."

"నడమంత్రపు సిరండీ వాళ్ళది! మనలాంటి వాళ్ళం కనిపిస్తామా?"

"కనిపించబట్టేగా ఆహ్వాన పత్రిక పంపిం చాడు!" నవ్వుతూ అన్నాడు.

"అది తన గొప్పతనం చాటుకునేందుకు!" అంది కోపంగా.

ఆ కోపం ఎందుకో తన కర్థం కాలేదు. అంత డబ్బు తను సంపాదించలేదని అనసూయ బాధపడు తూందా? ఆ బాధ నిలా కోపంగా బహిర్గతం చేసిందా?

చలపతి ఇల్లు బాగుంది. ఆరు గదులున్న డాబా. చుట్టూ కాంపౌండ్ వాలూ, గేటూ, ముందు పూలతోటా— అన్ని హంగులతో అందంగా ఉంది.

తను వెళ్ళేసరికి చలపతి ఇంట్లోనే ఉన్నాడు. భార్యా భర్తా ఇద్దరూ సాదరంగా ఆహ్వానించారు. అనసూయ అన్నట్లు వాళ్ళ కళ్ళు నెత్తికేం లేవు! తాగేందుకు ఐస్ ముక్కలు వేసిన నిమ్మరసం ఇచ్చి, ఇల్లంతా చూపించాడు.

"ఇల్లు బాగుంది, చలపతీ!" అన్నాడు మెచ్చు కోలుగా.

"ఒకటిన్నర లక్ష అయింది, మామా!"

"ఇంతకూ నువ్వు చేసే వ్యాపారం ఏమిటి?"

నలుగురు నాలుగు రకాలుగా చెప్పుకుంటారు గానీ, అసలు చలపతి చేసే వ్యాపారం ఫలానా అని ఖచ్చితంగా ఎవ్వరూ చెప్పలేరు.


"ఒకటని లేదు. ఎన్నో!" అంటూ నవ్వాడు. ఒకప్పుడు తిండికి జరిగేదే ఎంతో కష్టంగా ఉండేది చలపతికి. ఏ దారి పట్టాడో మరి, డబ్బు బాగా గడించాడు.

"గృహప్రవేశానికి రాలేదేం, పెదనాన్నా?" చలపతి భార్య అడిగింది.

"ఏవో ఇబ్బందులమ్మా!"

భోజనం, విశ్రాంతి అయ్యాయి.

వచ్చిన పని ముగించుకుని, సాయంత్రానికి పూరు చేరుకుంటే మంచిదన్న ఉద్దేశంతో "నాలుగు గంటల బస్సుకు వెళ్ళిపోతాను, చలపతీ!" అన్నాడు.




"ఏం తొందర? రేపెళ్ళకూడదూ? సాయంత్రం సినిమా కెళ్దాం!"

"ఇప్పుడేం సినిమాలొద్దూ! సూర్యంతో నువ్వేదో చెప్పావట?..."

"అవును. నువ్వొప్పుకుంటావో లేదో నన్న సందేహం మా ఇద్దరికీ కలిగింది. అతను నాకు బాగా తెలుసు. మనం వద్దంటే, నూరు మంది రెడీగా ఉన్నారు!"

"నా కిష్టం లేదనుకో... మీ అక్క పోరు పడ లేక... పైగా సూర్యం ధోరణి చూస్తే భయంగా ఉంది..."

"ఇప్పటికైనా నువ్వీ నిర్ణయం తీసుకున్నందుకు సంతోషం! నా దారి నాదే అంటే లాభం లేదు. అందరి దారే మనదీను. ఇది ప్రజా ప్రభుత్వం కదా?" అని పెద్దగా నవ్వాడు.

అంత పెద్దగా ఎందుకు నవ్వాలో, అసలా నవ్వులోని అంతరార్థం ఏమిటో తన కర్థం కాలేదు.

"ఏమో? రెండు వేలంటే పూరకే వస్తాయా? ఇద్దరాడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలి..."

"నిజమే! నీలాంటి సామాన్య గృహస్థుకు రెండు వేలివ్వడం కష్టంగానే ఉంటుంది. నే నో విషయం చెప్తాను. నువ్వేమనుకోవు కదూ?"

"అనుకునే దేముందిలే—చెప్పు?"

"నువ్వు రెండు వేలు ఇచ్చినందువల్ల నీ కొడుక్కి కొద్ది రోజుల్లో ఉద్యోగం వస్తుంది. ఉద్యోగం వచ్చిన నాటి నుండీ రిటైర్ అయ్యేరోజువరకూ సంపా దిస్తూనే ఉంటాడు కదా! కనక, నీకు పెద్దగా నష్టమేమీ లేదు!"

బాగుంది తర్కం! మనసులో అనుకున్నాడేగానీ. పైకి ఏమీ అనలేదు.

తను మౌనంగా ఉండడం చూసి తిరిగి ప్రారంభించాడు: "కొందరు ఉత్త పుణ్యానికి వేలకు వేలిస్తున్నారు కదా! దొరకని వస్తువులను బ్లాక్‌లో కొంటున్నారు. రూపాయ వస్తువు రెండు రూపాయ లకూ, నూ రూపాయల వస్తువు రెండు వంద లకూ, వెయ్యిది రెండు వేలకూ..." ఆగి తన ముఖం లోకి పరిశీలనగా చూశాడు.

"ఊఁ!..." ఏమనలేక గాఢంగా నిట్టూ ర్చాడు.

"ఇవన్నీ అందరికీ తెలిసిన రహస్యాలే! ఎవరికి చిక్కింది వాళ్ళు తింటున్నారు. ఇందులో ఏం తప్పు లేదు."

"అలా పబ్లిగ్గా దోచుకుంటుంటే, ఏమని అడిగే సాహసం ఎవ్వరికీ లేదన్నమాట!" వ్యథిత కంఠంతో అన్నాడు.


చిద్విలాసంగా నవ్వాడు చలపతి.

"అది అంతే మామా! పదిమందిలో ఒకడు తప్పు చేస్తే మిగతా తొమ్మిది మందీ అదేమని అడుగుతారు. ఆ పదిమందిలో సగానికి పైగా అదే దారిన పోతున్నప్పుడు ఎవరేమని అడుగుతారు? ఆ కొద్దిమందీ చూస్తూ నోరు మూసుకో వలసిందే!"

"పోనీలే! ఒకరో, ఇద్దరో అన్నా నీతిగా ఉన్నారు కదా? సంతోషమే!" తేలిగ్గా నిట్టూర్చి సంతోషంగా అన్నాడు.

"ఉన్నారు! నాకెలా తెలుసంటావేమో? నేను చేసే వ్యాపారం కమీషన్ వ్యాపారం కదా? రకరకాల మనుషుల దగ్గర కెళ్తుంటాను. కాంట్రాక్టు లిప్పించాను. పిల్లలకు స్కూల్సులో, కాలేజీల్లో సీట్లిప్పించాను. ఉద్యోగాలిప్పించాను. కంట్రోల్‌లో దొరకని వస్తువులు బ్లాక్‌లో ఇప్పించాను. ఇంకా ఎన్నో అలాంటివి! మంత్రులను, ఎమ్. ఎల్. ఎ. లను, ఇంజనీర్లను, ఆఫీసర్లను ఎందరినో చూస్తు న్నాను. అక్కడక్కడా కొరుకుడు పడని కొయ్య ల్లాంటి వాళ్ళూ ఉన్నారనుకో!" అని కొద్ది క్షణా లాగి, "వాళ్ళంతా నీ స్కూల్లో చదువుకున్న వాళ్ళే అనిపిస్తుంది!" అంటూ గలగల నవ్వాడు.

చలపతి అన్న చివరి మాటలు వినగానే ఏదో అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. వెంటనే



విచారపు కారు మేఘాలు ఆ ఆనందపు లుగును కాస్తా హరించి వేశాయి.

ఇకపై తనలాంటి పొగడ్తకు తగునా?

లోలోపలే బాధ పడుతూ మవునంగా ఉండి పోయాడు.

"మన ఎమ్. ఎల్. ఏ. ను చూడాలి. రేపు వెళ్దువు గానీ అంటే కాదంటున్నావు. పద, మరి— నిన్నలా బస్సెక్కించి..." తనెక్కడ మనసు మార్చుకుంటాడోనని కాబోలు డబ్బివ్వమని అడుగుతున్నాడు!

ఎంత తెలివి మీరిపోయాడు!

మధ్యలో వీని కెంత కమీషనో?

జేబులో నుండి డబ్బు తీసి. లెక్క పెట్టి, చలపతి చేతిలో పెట్టాడు. అలా డబ్బు ఇస్తున్నప్పుడు మనసు విలవిల్లాడిపోయింది. కన్నుల్లో నీరు తిరిగినంత పనయింది.

"అతన్నెప్పుడు చూస్తావు? పని కాస్త త్వరగా అయ్యేట్టు చూడు." మనసులోని బాధను పైకి ఏ మాత్రం కనిపించనీక అన్నాడు.

"రేపే! నువ్వింకేం వర్రీ కాకు. నెల రోజుల్లో సూర్యానికి ఉద్యోగం వస్తుంది. చూడు."

"సరే, నే వెళ్ళానిక. నీ పనులేవో చూసుకో. నాతో బస్ స్టాండ్ వరకూ రానవసరం లేదులే."

భార్యాభర్తలిద్దరూ గేటు వరకూ వచ్చి సాగనంపారు. రకరకాల సందేహాలతో, ఆందోళనలతో సతమతమై పోతూ బస్‌స్టాండ్ చేరుకున్నాడు.

ప్చ్! తను పొరపాటు చేయలేదు కదా?

ఈ బస్సింకా రాదేమిటి?

"నమస్తే, సార్!" అన్న మాటలకు ఆలోచనల నుండి తేరుకుని, తలెత్తి చూశాడు సుందరయ్య.

ఎదురుగా ఒక యువకుడు— చిరునవ్వుతో.

రెండే రెండు క్షణాలు పరికించి చూసి, "ఓ! జగన్! నువ్వా! బాగున్నావా? అబ్బ! ఎన్నాళ్ళయింది నిన్ను చూసి! అమ్మ బాగుందా? మీ అన్నావాళ్ళు ఎక్కడుంటున్నారు?" అంటూ చిరునవ్వుతో ప్రశ్నించాడు సుందరయ్య.

"ఆఁ! అంతా బాగున్నాం, సార్! మీ రేమిటిలా చిక్కిపోయారు? సూర్యం వాళ్ళంతా బాగున్నారా?"

"అంతా బాగున్నారు. ఆర్నెల్ల కిందటే నేను రిటైర్ అయ్యాను. నిన్ను చూసి రెండు మూడేళ్ళపైనే అయింది కదూ? ఉద్యోగం చేస్తున్నావా? పెళ్ళీ అదీ..."

"ఒక సంవత్సరం నుంచే ఉద్యోగం చేస్తున్నాను, సార్!"

"అంటే, నాలుగేళ్ళు నిరుద్యోగిగానే ఉన్నావన్న మాట?"

"అవును."

"అయితే చాలా ఇబ్బంది పడి ఉంటావుకదూ?"

"అవన్నీ చెప్పి నేనూ, విని మీరూ బాధ పడాల్సిందే!" అన్నాడు మెల్లగా నవ్వుతూ.

"పోనీలే, ఇప్పటికన్నా ఉద్యోగస్థుడివయ్యావు! ఎవరన్నా సిఫారసు చేశారా?"

"మనలాంటి వాళ్ళ కెవరు చేస్తారు సార్! అయితే ఒకటిమటుకు నిజం! ఉద్యోగం లేని ఈ నాలుగు సంవత్సరాలలో మా అన్న చాలాసార్లు చెప్పాడు 'వెయ్యో, రెండువేలో ఇచ్చి ఉద్యోగం సంపాదించుకో'మని. కానీ నేనే అందుకు ఒప్పుకోలేదు. ఒకసారైతే మా అమ్మ ఏడ్చింది కూడా. అయినా ఆ పని చేయలేదు."

"మీ అమ్మ మాటా వినలేదా, జగన్! గట్టివాడివే! యువకులంతా నీలా ఉండాలి!" అన్నాడు మృదు మందహాసంతో సుందరయ్య.

మనసులో మటుకు సన్నని అశాంతి మంటలు రేగాయి.

"సార్! ఒకసారి...అంటే, నేను నైన్త్ క్లాసులో ఉండగా ఒక సంఘటన జరిగింది. అప్పుడు నేర్చుకున్న పాఠాన్ని నే నెప్పటికీ మరచిపోలేను. బహుశా మీకు గుర్తులేదేమో?" అని సుందరయ్య ముఖంలోకి చూశాడు— 'గుర్తు చేసుకోండి!' అన్నట్లు జగన్నాథం.

"ఏ సంఘటన?"

ఎంతసేపు ఆలోచించినా ఆయన కా సంఘటనేదో గుర్తు రాలేదు. జగన్నాథం కళ్ళ ముందు మటుకు ఆ నాటి ఆ సంఘటన సినిమా రీలులా కదిలింది.

• • •

సరిగ్గా పది సంవత్సరాల క్రితం జరిగింది. తనప్పుడు నైన్త్ క్లాసులో ఉన్నాడు. సుందరయ్య మాస్టారుగారి ఇంటికి దగ్గరగాఉన్న ఒకచిన్న పూరింట్లో అమ్మమ్మా, అమ్మా, తనూ ఉండేవారు. నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. అన్న పదిమైళ్ళ దూరంలో ఉన్న పట్నంలో చక్కెర ఫ్యాక్టరీలో రోజు కూలీగా పనిచేసే వాడు. ఉన్న ఎకరం పొలం చూసుకుంటూ, అప్పుడప్పుడు కూలీకికూడా వెళుతూ ఎలాగో సంసార శకటాన్ని నెట్టేది అమ్మ. తన చదువు అమ్మకు నిజంగా తలకు మించిన బరువే. ఆ వూళ్ళోని ఎలిమెంటరీ స్కూలు వదిలి వేసినా, తన చదువు సంధ్యల బాధ్యత మాస్టారుకే అప్పగించింది అమ్మ. మగ దిక్కు లేకపోవడం, పేదరికం, తన మీద మాస్టరు కున్న ప్రత్యేకమైన అభిమానం—ఈ అన్ని కారణాల వల్ల తన చదువు సంధ్యలను గమనించే బాధ్యతను సంతోషంగానే స్వీకరించారు మాస్టరు. సూర్యం ఆరు లోనో, లేదా ఏడో తరగతిలోనో ఉండే వాడు. శంకర్ అప్పటికే మిలిటరీకి వెళ్ళిపోయాడు. సూర్యం, తనూ పక్క టౌన్‌లోని స్కూలుకు రోజూ మూడు మైళ్ళు నడిచి పోయి, నడిచి వచ్చేవారు. సూర్యంతో పాటు చదువుకుంటూ ఎక్కువగా మాస్టరింట్లోనే ఉండేవాడు. రాత్రిళ్ళు ఇద్దరినీ దగ్గర కూర్చోపెట్టుకుని హోమ్‌వర్కు చేయించడం, ఆ రోజు జరిగిన పాఠాలు చదివించడం, స్కూల్లో జరిగిన విశేషాలన్నీ ఆసక్తిగా వినడం, తమ ప్రవర్తనలో ఏమన్నా లోటుపాట్లుంటే మందలించి, సరిదిద్దడం— ఇవన్నీ చేసేవారు మాస్టరు.

ఆ రోజుల్లో ఆయన తీసుకున్న శ్రద్ధ, కృషి— వీటివల్లనే తను డిగ్రీ తీసుకోగలిగాడు.

సత్ప్రవర్తనకు ఆయన వేసిన పునాదిరాళ్ళ మీదే ఈనాడొక మంచి వ్యక్తిగా నిలిచో గలుగుతున్నాడు.

ఆ రోజు తనకు బాగా గుర్తుంది.

ఆదివారం—

టౌన్‌లో కొత్త సినిమా ఆడుతూంది. తన ఫ్రెండ్సంతా చూశారు. ఎన్. టి. ఆర్. ఫైటింగ్ బ్రహ్మాండంగా ఉందని ఒకే పొగడడం అంతా— ఒక ఆదివారం మ్యాట్నీ కెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. కానీ అమ్మ నడిగితే పంపదు. ఆ విషయం ఖచ్చితంగా తనకు తెలుసు. ఆలోచిస్తుండగా— "జగ్గన్నా!" అంటూ హీన స్వరంతో పిలిచింది అమ్మమ్మ. ఎందుకో నని వెళ్ళాడు.

"జిలేబీ తినాలని ఉందిరా! టౌను కెళ్ళి తీసుకురా!"

ఆ విషయం అమ్మతో చెప్పాడు.

ఇంటి వెనక ఉన్న పాకలో అన్నం వండుతున్న అమ్మ లోపలికి వచ్చి, చిల్లర లేదంటూ ఐదు రూపాయల కాగితం చేతిలో పెట్టింది.

"రూపాయి జిలేబీ తీసుకుని, మిగతా నాలుగు రూపాయలూ జాగ్రత్తగా తీసుకురా. ఇంటి ఖర్చుకు కావాలి. త్వరగా వెళ్ళి రా. ముసల్దాని ప్రాణం ఎప్పుడు పోతుందో ఏమో!" అలాగే నన్నట్టు తలూపాడు.

అమ్మమ్మకు తీపి పదార్థాలంటే మహా ఇష్టం! అందులోనూ జిలేబీ అంటే ప్రాణం! అమ్మ అప్పుడప్పుడూ టౌన్నుండి జిలేబీ తెప్పించి పెట్టేది. అమ్మమ్మ కేదో జబ్బు. ఏం జబ్బో సరిగ్గా తనకు తెలీదు. చాలా రోజులుగా మంచం లోనే ఉంది. కొద్ది రోజులు గవర్నమెంటు హాస్పిటల్ మందులు వాడి, తరవాత మానేసింది అమ్మ. 'ఆ మాత్రలు నేను మింగలే'నని అమ్మమ్మ మొండి కేయడమే అందుకు కారణం. అమ్మ ఒకరోజు కోపగించుకుంటే, "నేను బతికి ఎవరి నుద్ధరించాలి? చచ్చేటప్పుడన్నా నన్ను హాయిగా చావనీ" అని విసుక్కుంది.

అమ్మ ఏమనుకుందో అమ్మమ్మకు మందు ఇచ్చే ప్రయత్నం మరి చేయలేదు.

అమ్మమ్మ ఎక్కువ రోజులు బతకదని అందరికీ తెలుసు.

ఐదు రూపాయల కాగితం చూడగానే తన మనసులో దోబూచులాడుతున్న ఆలోచనకు ఒక స్పష్టమైన రూపం ఏర్పడింది.

సూర్యాన్ని తీసుకుని టౌనుకు వెళ్ళాడు.

మ్యాట్నీ టైమ్‌కు థియేటర్ దగ్గరకు చేరుకున్నారు.

ఆదివారం—పైగా కొత్త సినిమా.

క్రిక్కిరిసి ఉన్నారు జనం!

రెండు టిక్కెట్లూ (రెండు రూపాయలకు కొనవలసినవి) బ్లాక్‌లో ఐదు రూపాయలకు కొన్నాడు!

సినిమా చూసి, హాల్లో నుండి ఇవతలకు వచ్చాక కానీ జిలేబీ, అమ్మమ్మా, ఇల్లూ గుర్తు రాలేదు.

చేతిలో పైసా లేదు.

తెలియని భయం పట్టుకుంది.

అప్పుడిక ఇంటి కెళితే చివాట్లు తప్పవని బస్‌స్టాండ్‌లో పడుకుని నిద్ర పోయారు సూర్యం, తనూ!

తెల్లవారి ఇంటికి వెళ్ళలేదు.

సాయంత్రం వరకూ బస్‌స్టాండ్‌లోనే కాలక్షేపం చేశారు. ఆకలి తన ప్రతాపాన్ని చూపసాగింది. దానితో కాళ్ళీడ్చుకుంటూ ఇంటి ముఖం పట్టారు.

ఆ రోజు మధ్యాహ్నమే అమ్మమ్మ పరిస్థితి విషమించిందట. తను రాబోయే ముందు శాశ్వత నిద్రలోకి జారుతున్నట్లు అమ్మ ఏడుస్తూ చెప్పింది.

నిద్ర పోతున్నట్లే ఉన్న అమ్మమ్మ ముఖం లోకి చూడగానే కన్నీరు పొంగింది.

ఫలానా అని చెప్పలేని భయం, బాధా హృదయంలో చోటు చేసుకున్నాయి.

ఒక నిమిషం తరవాత ఉగ్రనరసింహస్వామిలా తన ఎదుట నిలుచున్న మాస్టార్ని చూడగానే గజగజ వణికి పోయాడు.

"ఒరే! నీ కా ముసలామె కోరిక తీర్చడం కన్నా, సినిమా ఎక్కువైందా? చచ్చే ముందు నీ కోసమే చూసింది. నువ్వంటే ఆ ముసలామె కెంత ప్రేమో నాకు తెలుసు. నువ్వు టౌనుకు వెళ్ళింది ఎందుకు? చేసిన పనేమిటి? నువ్వు మనిషివి కాదురా! నీ కన్నా పశువు నయం!" తీవ్రమైన కటు స్వరంతో అరిచినంత పని చేశారు.

సహాయం ద్వారా బి.ఏ. మంతా రాబట్టిన ట్లున్నారు మాస్టరు. అమ్మతో ఆ విషయాలన్నీ చెప్పి, "సుబ్బమ్మా! మనిషికి చదువెందుకమ్మా! ఇలాంటి పశువుగా దిగజారి పోకుండా కొంత విచక్షణా జ్ఞానాన్ని సంపాదించుకునేందుకేగా? రేయింబవళ్ళు కష్టించి, ఇలాంటి పశువు కోసం ఎందుకు బాధపడతావు? ఒరే, మూర్ఖుడా! ఇక నీకు చదువూ సంధ్యా ఏం అక్కర్లేదు. కూలీ చేసుకుని బతుకు. నువ్వు నీ పెద్ద కొడుకు దగ్గర కెళ్ళి హాయిగా బతకమ్మా! వీడు పెద్దయినా, పచ్చి స్వార్థపరుడై దేశాన్ని దోచుకుంటాడే తప్ప, ఎవర్నీ సుఖ పెట్టడు! ప్రాణాలన్నీ వీడి మీదే పెట్టుకున్న ఆ ముసలామె కేం చేశాడు? రేపు నీకూ అంతే! వీడికి చదువు చెప్పించినందుకు నేను సిగ్గుతో చితికి పోవాలి!" అన్నారు.

తన కన్నుల్లో చివ్వున నీరు తిరిగింది.

చివరి ఘడియల్లో తనను చూడాలని, చూడలేక కళ్ళు మూసిన అమ్మమ్మను గురించి అనుకోగానే మనసు ముక్కలు ముక్కలైంది.

అవి చాలదన్నట్లు మాస్టా రన్న ఒక్కో మాటా ఒక్కో వాతలా తేలింది—హృదయం మీద.

ఎందు కలాంటి పని చేశాడు?

కన్నీరు చెంపల మీదుగా జారింది.

మాస్టరు మళ్ళీ తిట్టడం ప్రారంభించారు.

"రోజూ నిన్ను దగ్గర కూచో పెట్టుకుని చెప్పిన నీతి పాఠాలన్నీ ఏ గంగలో కలిసి పోయాయిరా, వెధవా! ఛీ! ఛీ! ఇక నీ ముఖం నాకు చూపించకు. మనుషులూ, మమతలూ అంటే నీకు లెక్క లేదు!"

కోపంతో కందిపోయిన ఆయన ముఖంలోకి చూసేందుకు భయం వేసి, అక్కడ నుండి వెళ్ళి పోయాడు.

ఆ రాత్రంతా కుమిలి కుమిలి ఏడ్చాడు.

అమ్మమ్మ కోరిక తీర్చలేకపోయానే, చివరి ఘడియల్లో ఆమెను చూడలేకపోయానే అన్న బాధ హృదయాన్ని సమూలంగా దహించ సాగింది. ఆవేదనా, పశ్చాత్తాపం హృదయాన్ని సమంగా పంచుకున్నాయి.

నాలుగు రోజులు జరిగాయి.

"జగన్!" అంటూ ఆప్యాయంగా పిలవడం లేదు మాస్టరు. ఏదో పోగొట్టుకున్న వానిలా, దిక్కు తోచక తిరిగా డా నాలుగు రోజులూ. మాస్టర్ని క్షమా భిక్ష కోరితే కానీ, మనసుకు శాంతి లభించదనిపించింది. అప్పటికి ఆయన కోప జ్వాల చాలా వరకూ చల్లారింది. ప్రేమగా పలకరించి దగ్గర కూచో పెట్టుకున్నారు. మెల్లగా, అనునయంగా తను చెప్పవలసిన విషయం చెప్పడం ప్రారంభించారు.

"కాదురా, జగన్! నే నిన్నాళ్ళు చెప్పిన నీతి పాఠాలు ఎలా మరచి పోయావు? బ్లాక్‌లో టిక్కెట్లు కొనడం అవినీతిని ప్రోత్సహించినట్లు కదూ? ఇది చాలా చిన్న తప్పే కావచ్చు నీ దృష్టిలో. అయితే పతనానికి ఇవే జారుడు మెట్లు. ఒక తప్పు చేసిన వాడు మరో తప్పు చేసేందుకు వెనకాడడు. నువ్వు చేసిన ఈ చిన్న తప్పు వల్ల నువ్వెంత నష్టపోయావో నీ కిప్పటి కన్నా అర్థం అయిందా? చివరి ఘడియల్లో మీ అమ్మమ్మను చూడలేక పోయావు. ఆమె కోరిన చిన్న కోరిక తీర్చలేక పోయావు. చాలా చిన్న తప్పే ఒక్కోసారి విషాద పరిణామాలకు దారి తీస్తుంది. నిన్నో మంచి వ్యక్తిగా తీర్చి దిద్దాలని ఉపాధ్యాయుడుగా నే ననుకోవటం దురాశ కాదు. మీ అమ్మ తరవాత నీ ఉన్నతిని చూసి సంతోషించే వాళ్ళలో నేనే మొదటి వాణ్నిరా! అందుకే నీ విలాంటి పని చేసినందుకు విపరీతంగా బాధ పడ్డాను. ఇంకెప్పటికీ ఇలాంటి పనులు చేయకు. సరేనా?"

"ఈ సారికి క్షమించండి, సార్! ఇంకెప్పటికీ ఇలాంటి పనులు చేయను. నే నెక్కడున్నా, ఏం చేసినా మీరు గర్వించేలా నా జీవితాన్ని, భవిష్యత్తును తీర్చి దిద్దుకుంటాను." కన్నుల్లో నీరు తిరుగుతుండగా డగ్గుత్తికతో అన్నాడు.

చిన్నగా నవ్వి, అభిమానంగా చూశారు మాస్టరు.

ఆయన సలహా సహకారాలతోనే బి. ఎ. పాసయ్యాడు తను. అమ్మకు జబ్బు చేసింది. అప్పు లెక్కువయ్యాయి. ఉన్న ఎకరం పొలం అమ్మి అప్పులు తీర్చి, అన్న దగ్గర కెళ్ళారు అమ్మా, తనూ.

ఊరు వదలడం కన్నా మాస్టరుతోటి అనుబంధాన్ని తెంచుకుని వెళ్ళడం ఎంతో కష్టమనిపించింది.

• • • •



"సార్! మీ కింకా గుర్తు లేదా?" నవ్వుతూ ఆ విషయాలన్నీ గుర్తు చేశాడు జగన్నాథం.

"ఆc! ఆc! గుర్తొచ్చింది. ఆ రోజు ఆ తప్పు చేసినందుకు నిన్ను బాగా తిట్టాను కదూ?" మెల్లని స్వరంతో అన్నాడు సుందరయ్య.

"అలా అనకండి! ఆ రోజు మీరు దండించ బట్టే ఈ రోజు మంచి దారిలో నడవగలుగు తున్నాను. ఇదంతా మీ కృషి, ఆశీర్వాదాల ఫలితమే!" కృతజ్ఞత నిండిన చూపులతో సుందరయ్య వేపు చూస్తూ అన్నాడు.

జగన్నాథం ఆశించినట్లు సుందరయ్య ముఖంలో సంతోష రేఖలు తళుక్కు మనలేదు. గర్వం సగర్వంగా తలెత్తి చూడలేదు.

ముఖం వివర్ణమై పోయింది.

కన్నుల్లో ఆవేదన తాలూకు నీలి నీడలు పరుచు కున్నాయి. సుందరయ్య ముఖం లోని మార్పును గమనించిన జగన్నాథం ముందు ఆశ్చర్యపోయాడు. తరవాత కారణాల కోసం గాలించ సాగాడు.

'ఎందుకీ మార్పు? తను అనాలోచితంగా మాట్లాడి మాస్టరు మనసును నొప్పించ లేదు కదా?' అను కున్నాడు.

"ఏమి టలా ఉన్నారు, సార్? అమ్మగారు బాగు న్నారా?" సందేహిస్తూ అడిగాడు.

"ఆc!" అని పైకి అన్నాడు సుందరయ్య. కానీ మనసు మనసులో లేదు.

'నీకు దారి చూపిన నేను, దారి తప్పానయ్యా, జగన్!" అని విలవిల్లాడి పోయాడు.

'నీ కున్న బుద్ధి, జ్ఞానం నాకు లేకపోయాయి. నేను గర్వించేలా నీ ప్రవర్తనను తీర్చి దిద్దుకున్నావు. కానీ, నేను? నా లాంటి గురువు నీ కున్నందుకు తల వాల్చుకునేటట్లు చేశాను. ఛ్ఛ! నీ ముఖంలోకి ధైర్యంగా ఎలా చూడనిక? ఊహూc. అలా ఎప్పటికీ జరగనివ్వను. నీకు తగిన గురువుగానే నే నుంటా నెప్పటికీ. చలపతి దగ్గర కెళ్ళి తిరిగి డబ్బు తీసు కుంటాను. భగవాన్! జగన్నాథం రూపంలో వచ్చి నన్ను కాపాడావు కదూ? నీకు శతకోటి వందనా లయ్యా, స్వామీ! చివరి దశలో ఈ మచ్చను చూసు కుని బాధ పడకుండా నన్ను కాపాడావు!' అని మనసులో అనుకుని క్షణ కాలం కళ్ళు మూసుకుని, భగవంతునికి వందనా లర్పించాడు.

"ఏమైంది, సార్! ఒంట్లో బాగాలేదా?" ఆందో ళనగా ప్రశ్నించాడు జగన్నాథం.

చిరునవ్వుతో తన ముఖంలోకి చూసిన సుంద రయ్య కన్నుల్లో కదులుతున్న కన్నీటి పొరను చూసి మరింత కలవరపడ్డాడు జగన్నాథం.

"నువ్వేం గాభరా పడకు—నాకు బాగుంది" అని పై పంచతో కళ్ళు ఒత్తుకున్నాడు.

"సూర్యం ఎక్కడున్నాడు, సార్? ఉద్యోగం చేస్తున్నాడా?"

"లేదు, జగన్! మూడేళ్ళుగా ప్రయత్నిస్తున్నా ఏ ఒక్క ప్రయత్నమూ ఫలించలేదు. లంచమన్నా ఇవ్వాలి. లేదా, రికమెండేషనన్నా కావాలి." విచార కంఠంతో అన్నాడు.

జగన్నాథం కొద్ది క్షణాలు ఆలోచిస్తూ ఉండి



పోయాడు. తర్వాత గబగబ జేబులోనుండి కాగితం, పెన్ను తీసుకుని "సార్! నా అడ్రసు రాసిస్తున్నాను. సూర్యాన్ని అప్లికేషన్ పంపుని చెప్పండి!" అని తన అడ్రసు రాసి, సుందరయ్య చేతిలో పెట్టాడు.

అర్థం కానట్లు చూశాడు సుందరయ్య.

"పది రోజుల క్రితమే మా ఆఫీసు క్లర్కు ఒకతను రాజీనామా చేసి బొంబాయిలో మంచి ఉద్యోగం వస్తే వెళ్ళాడు. ఆ పోస్టుకు ట్రై చేద్దాం."

"అంత సులభంగా దొరుకుతుందా?" ఆశా నిరాశల మధ్య నలిగిపోతూ ప్రశ్నించాడు.

"మాదొక ప్రైవేట్ ఫరమ్. మా జి. ఎమ్. చాలా మంచివాడు. ఎంత మంచివాడంటే ఆయనను చూసి, ఒక గంట ఆయనతో గడిపితేనేగానీ ఆయన మంచితనం మనకు అర్థం కాదు. చెప్తే ఎవ్వరూ నమ్మరు. రికమండేషన్స్ అన్నా, లంచాలన్నా ఇక్కడ ఎగిరి అక్కడ పడ్తారు!"

"నిజంగానా, జగన్!" నమ్మలేనట్లుగా అన్నాడు సుందరయ్య.

"నిజం, సార్! పేదరికమే ఒక అడిషనల్ క్వాలిఫి కేషన్ అంటా రాయన. విషయం నే నాయనతో చెప్తాను. మీరు రిటైర్ అయ్యారని చెప్తే తప్పక ఉద్యోగం ఇస్తారు!"

"నమ్మలేకుండా ఉన్నానయ్యా!" ఈసారి ఆనందంకన్నా ఆశ్చర్యమే ఎక్కువగా ధ్వనించిం దాయన కంఠంలో.

"కానీ, నమ్మాలి! మనం అనుకుంటున్నట్లు లోకంలో అంతా డబ్బు మాయలో పడి, నీతి నిజాయితీ లను వదులుకోలేదు. కారుచీకటిలో చిరుదివ్వెల్లా ఇలాంటి వాళ్ళు మనకు వెలుగును ప్రసాదిస్తున్నారు. లోకంలో ఇంకా మంచితనం ఉంది సుమా అని చెప్తున్నారు."

"ఎంత చల్లని మాట చెప్పావయ్యా!" ఆ మాట అంటున్నప్పుడు కాంతిహీనంగా ఉన్న సుందరయ్య కళ్ళలో కాంతి రేఖలు తళుక్కుమన్నాయి. గొంతు పెకిలింది.

"ఇంకా కొంత మంచితనం లోకంలో ఉందంటే, ఇందుకు కారణం ఏమిటో తెలుసా, సార్?"

"ఏమిటంటావ్?" కుతూహలంగా ప్రశ్నించాడు.

"మీలాంటివారి బోధనా, సత్ప్రవర్తనా ..."

సుందరయ్య కళ్ళు చప్పున క్రిందకు వాలి పోయాయి.

'అయ్యా! జగన్! నీకు తెలియదు. నే నెలాంటి పని చేశానో... తెలిస్తే ...' సుంద రయ్య మనసు గొణుగుతూంది.

"అదో—మీ బస్సు వచ్చింది. అరే, నేను వెళ్ళా ల్సిన బస్సూ వచ్చింది. రండి, సార్, మిమ్మల్ని బస్సులో ఎక్కించి వెళ్తాను."

ఆ ఆప్యాయతకు సుందరయ్య కళ్ళు చెమ్మ గిల్లాయి. హృదయం పులకించింది.

"నే నిప్పుడు వెళ్ళను." దూరంగా చూస్తూ అన్నాడు.

"ఏం?"

"టౌనులో కాస్త పనుంది."

"అయితే, ఆ సంచీ ఇలా ఇవ్వండి!" అని సుందరయ్య దగ్గరున్న సంచీ తీసుకుని, తన బ్యాగ్ నుండి బంగినపల్లి మామిడి పండ్లు తీసి సంచిలో వేస్తూ "ఇవి అమ్మగారి కివ్వండి! పెళ్ళి చూపుల నుండి తిరిగి వెళ్తున్నాను. కుదిరితే మన వూరికి వస్తాను. అంతా తప్పక రావాలి, సార్! అమ్మగారితో ఈ విషయం చెప్పండి" అన్నాడు జగన్నాథం.

"తప్పకుండా!" అన్నాడు డగ్గుత్తికతో.

ఆయన కన్నులలోని నీటి పొరను చూసిన జగన్నాథం "సార్!" అన్నాడు విస్మయాందోళన భరిత కంఠంతో.

"సంతోషం, జగన్! నిన్ను చూస్తుంటే నా కెంతో సంతోషంగా ఉంది, బాబు! ఇంతకన్నా గౌరవం ఉపాధ్యాయుడిగా నా కింకేం కావాలి?" అన్నాడు చలిత కంఠంతో.

దాంతో జగన్నాథం కళ్ళూ చెమ్మగిల్లాయి.

"వస్తాను, సార్! ఎందుకైనా మంచిది, అప్లికేషను రిజిస్టర్డ్ పోస్టులో పంపండి! జాగ్రత్తగా వెళ్ళండి!" అని బ్యాగ్ తీసుకుని, గబగబ తన బస్సు కేసి నడిచాడు.

తృప్త నయనాలతో జగన్నాథం వెళ్తున్న వేపే చూస్తుండిపోయాడు కాసేపు సుందరయ్య.

ఆయన హృదయం అవ్యక్తమైన పులకరింతకు లోనైంది.

'లోకంలో అంతా అవినీతి, చీకటే అలుముకో లేదు. కాంతి నిచ్చే దివ్వెలూ ఉన్నాయి. ఈ దీపాల సాయంతో మరికొన్ని దీపాలను వెలిగించి, ఈ గాఢాంధకారాన్ని తొలగించవచ్చు. అయితే, పరిస్థితుల పెనుగాలి ఉద్ధృతానికి ఈ చిరుదివ్వెలు ఆరిపోకుండా ఉండాలి. తన విషయంలో అదేకదా జరిగింది! ఎలాగో జగన్నాథం వచ్చి తనను రక్షించాడు! అనుకూలమైన వాతావరణాన్ని ప్రసాదించి, ఈ చిరు దివ్వెలు సదా వెలిగేటట్లు చూడు, భగవాన్!' అని మనసులో అనుకుంటూ, కనుకొలకుల్లో నిలిచిన రెండే రెండు కన్నీటి బొట్లను తుడుచుకున్నాడు సుందరయ్య. *